క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



గద్వాల అర్బన్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లకు పని ఒత్తిడి తగ్గించాలని, బీఎల్వో విధులు నిర్వహించిన డబ్బులు ఇప్పించాలని, అంగన్‌వాడీ సెంటర్లలోని 3–6ఏళ్ల పిల్లలకు యూనిఫాంలతో పాటు ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని, ఖాళీలను భర్తీ చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇందిరమ్మ, టీచర్లు, ఆయాలు, తదితరులు ఉన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



గద్వాల అర్బన్: ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎర్రవల్లి నుంచి జిల్లా కేంద్రానికి బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌సర్కిల్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ముఖ్యపాత్ర వహించి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ హాజరై ఎర్రవల్లి కూడలిలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, రాజ్‌కుమార్, ఎల్కూర్ శ్రీను, మద్దిలేటి, ఈదన్న, బజారి, తిమ్మారెడ్డి, నాయుడు ఉన్నారు.

బీజేపీ నాయకుడికి సన్మానం

అయిజ: మండల కేంద్రంలో శుక్రవారం కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమసేన్ రావుని డాక్టర్ సెల్ జిల్లా కో కన్వీనర్ డాక్టర్ శంకర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాట్లాడారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, రైతులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యకర్తలు ఈరన్న, మల్లేష్, శ్రీను, నరసింహులు, మల్లకల్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీపీఐ కౌన్సిల్ సమావేశం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల్ నర్సింహాతో పాటు నాయకులు హాజరవుతారని తెలిపారు. సీపీఐ నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

తాత్కాలిక మరమ్మతులు

అయిజ: రాయచూర్–కర్నూల్ రోడ్డుపై కల్వర్టుల వద్ద ఏర్పడిన గుంతలకు శుక్రవారం అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయిజ నుంచి పర్దీపురం వరకు ఐదు కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. గతంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టి కల్వర్టు పనులు చేయలేదు. కల్వర్టుల వద్ద మోకాలు లోతు గుంతలు పడడంతో వాహనాలు అదుపు తప్పి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యారు. కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

మానవపాడు: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ సూచించారు. శుక్రవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, కొర్విపాడు స్టేజీ ల సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి వాహనాలు నడపాలన్నారు.

వంతెన నిర్మాణం జరిగేనా?

- వాగుల ఉధృతికి తెగిన కల్వర్టులు
- ఏళ్లు గడుస్తున్నా చేపట్టని పనులు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అత్యవసర పరిస్థితుల్లో వాగు దాటుతున్న ప్రజలు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నియోజకవర్గంలోని పలు వాగులపై వంతెనలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ఆరంభమైతే వాగులు ఉప్పొంగి పారడం వల్ల పక్క గ్రామాలకు కూడా వెళ్లలేని పరిస్థితి కొనసాగుతుంది. తప్పని పరిస్థితుల్లో వాగు దాటేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారు. వాగులపై వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వాగులపై వంతెనలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి..

– ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు నుంచి ఎర్రవల్లి వెళ్లే దారిలో పెద్దవాగు వర్షాకాలం ఉధృతంగా ప్రవహిస్తుంది. బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సాసనూలు – షేకుపల్లి, ఇటిక్యాల – చాగాపురం, ఉదండాపురం నుంచి ఎస్సీ కాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో వాగులకు వంతెనలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– మానపాడు మండలంలో అమరవాయి నుంచి మానపాడు, చెన్నిపాడు నుంచి పెద్ద పోతులపాడు, మానపాడు నుంచి చెన్నిపాడుకు వెళ్లే దారిలో వాగులు వర్షాలకు ఉప్పొంగుతూ రోజుల తరబడి పారుతున్నాయి.



ఫిల్లర్ గుంతలకే పరిమితమైన ఆర్.గార్లపాడు పెద్దవాగు

– ఉండవెల్లి మండలంలో పుల్లూరు నుంచి కలుగోట్లకు వెళ్లే దారిలో ఉన్న వాగులో కారు ప్రమాదం జరిగి గర్భిణి మృతి చెందింది. ఉండవెల్లి నుంచి చిన్న ఆముదాలపాడు, ప్రాగటూరు నుంచి మారమునగాల, భైరాపురం – బస్వాపురం వెళ్లే దారిలో వాగులు వర్షాల వల్ల పొంగి పొర్లుతున్నాయి.

– అలంపూర్ మండలంలో సుల్తానాపురం నుంచి జిల్లెలపాడుకు వెళ్లే దారిలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. రెండు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

– రాజోళి మండలంలో తుమ్మిళ్ల నుంచి మాన్‌దొడ్డి, ముండ్లదిన్నె నుంచి రాజోళి, అశోక్‌నగర్ క్యాంపు నుంచి తుమ్మిళ్లకు వెళ్లే దారిలో వాగులు వర్షాకాలం రోజులు తరబడి ఉధృతంగా ప్రవహిస్తాయి.

– వడ్డేపల్లి మండలంలో రామాపురం నుంచి వల్లూరు, జూలకల్ నుంచి జూలకల్ స్టేజీ, కొంకల నుంచి వడ్డేపల్లి, తనగల నుంచి వడ్డేపల్లి వెళ్లే గ్రామాల మధ్యలో ఉన్న వాగులు వర్షాకాలం ఉధృతంగా ప్రవహిస్తాయి.

– అయిజ మండలంలో ఎక్లాస్‌పురం నుంచి దేవబండ వెళ్లే దారిలో వాగు వర్షాకాలం ఉప్పొంగుతుంది. దీనివల్ల ఏక్లాస్‌పురం, దేవనబండ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

– ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల సమీపంలో ఉధృతంగా ప్రవహించే వాగులపై త్వరితగతిన వంతెనలు నిర్మించి ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి..



మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లడానికి వాగులపై వంతెనలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. గ్రామం నుంచి ఎర్రవల్లి చౌరస్తాకు వెళ్లే దారిలో నాలుగు వాగులు ఉండటం వల్ల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి వాగులపై వంతెనలు నిర్మించాలి.

– బోయ రాజు, సాసనూలు

నత్తనడకన పనులు..



మా ఊరి సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఐదేళ్లు పూర్తయింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో నేటికీ పూర్తి కాలేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. వర్షాకాలంలో వాగు పొంగి పొర్లడంతో నెలరోజులు వాగు దాటడానికి రాలేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

– చిన్న వీరన్న, ఆర్.గార్లపాడు

ఉన్నతాధికారులకు విన్నవించాం..

గార్లపాడు దగ్గర బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించి ఫిల్లర్ గుంతలను తీశాక వర్షాలు కురవడంతో వరదనీరు చేరడం వల్ల పనులు ఆగిపోయాయి. ఫిల్లర్ గుంతలలో రాతిగుండ్లు ఉండటంతో బ్లాస్టింగ్ చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటోంది. జూరాల నుంచి నీరు రావడంతో పనులు సాగడం లేదు. ఆయా గ్రామాల వాగులపై వంతెనలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– మహేష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈఈ, అలంపూర్

పండగలా 'స్వచ్ఛదనం–పచ్చదనం'



గద్వాలలో మొక్క నాటుతున్న జెడ్పీమాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్



మేడికొండ ర్యాలీలో పాల్గొన్న డీఆర్‌డీఓ నరసింగరావు

గద్వాల: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండగ వాతావరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గద్వాల జిల్లా కేంద్రాన్ని హరిత పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు ఉత్సాహంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

అయిజ: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి పర్యావరణాన్ని కాపాడుకుందామని డీఆర్‌డీఓ, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ నరసింగరావు అన్నారు. మండలంలోని మేడికొండ, పులికల్ గ్రామాల్లో డీఆర్‌డీఓ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం పులికల్ గ్రామంలో మొక్కలు నాటారు. జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌ను సందర్శించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పులికల్ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలు పచ్చదనంతో ఉండేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని సాసనూలు, షేకుపల్లి, తిమ్మాపురం గ్రామాలను ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ, ఏపీఎం, టీఏలు, కార్యదర్శులు ఉన్నారు.

కేటీదొడ్డి: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. గువ్వలదిన్నెలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

గద్వాల అర్బన్: నాడు దేశ స్వాతంత్ర్యం కోసం పిలుపునిచ్చిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో దేశాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడుకుందామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో బడ్జెట్ కేటాయింపుల్లో కోతలకు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప్పేరు నర్సింహ, లక్ష్మన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, రైతు సంఘం నాయకులు ఉన్నారు.

గట్టు: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమబాట పట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, సంపదను బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తోందన్నారు. నాయకులు శాంతప్ప, నర్సింహులు, వెంకటేష్, జయన్న, చంద్రు, హనుమంతు, నాయకులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండల కార్యాలయంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు మద్దతు ధర కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాండు, వెంకటేశ్వర్లు, గోపీనాథ్, రాఘవేంద్ర, సురేష్ ఉన్నారు.

అయిజ: కార్మికుల హక్కులకోసం ఐకమత్యంగా పోరాడుదామని సీఐటీయూ నాయకుడు ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, భీమన్న, అడవిరాజు, వెంకటేష్, తిరుమల్, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం రవి

శాంతినగర్: సమాజంలో వివిధ సమస్యలు చోటుచేసుకుంటాయని, వాటిని పరిష్కరించుకోవాలంటే వివిధ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుందనే విషయమై స్థానిక సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులకు మండల సమీకృత కార్యాలయాలను చూపించి అవగాహన కల్పించారు. శాంతినగర్‌లోని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్, వ్యవసాయశాఖ, విద్యాశాఖ కార్యాలయాలను విద్యార్థులు సందర్శించారు. ఆయాశాఖల్లో చేపట్టే పనుల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని గంజిపేట సబ్ స్టేషన్ మెయింటెనెన్స్, చెట్ల తొలగింపు, కొత్త లైన్లు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని రాజయ్యతోట, మొమిన్‌మహెల్లా, రాఘవేంద్ర కాలనీ, వేదానగర్, ధరూరు మెట్టు, రాంనగర్, తెలుగుపేట, తేరుమైదానం, బీసీ కాలనీ, బీడీ కాలనీ, గంజిపేట, సుంకులమ్మమెట్టు, గాంధీచౌక్, పిల్లిగుండ్ల, దౌదర్‌పల్లి, పాత కూరగాయాల మార్కెట్, చేపల మార్కెట్, కొత్తపల్లి తదితర కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అలంపూర్: విద్యుత్ అంతరాయం ఉంటుందని అలంపూర్ సబ్ డివిజనల్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ పరిధిలోని అలంపూర్ పట్టణం, భీమవరం, ఉండవెల్లి, అలంపూర్ చౌరస్తా, మారమునగాల, కోదండాపురం, ఇటిక్యాల, సాసనూలు, ఆర్.గార్లపాడు, సాతర్ల, బీచుపల్లి, చాగాపురం, శాంతినగర్ టౌన్, రామాపురం, మానవపాడు, కలుకుంట్ల, జల్లాపురం సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

రాజోళి: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సందీప్ తెలిపారు. రాజోళి, మాన్‌దొడ్డిలలో ఉన్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. రాజోళి, తుమ్మలపల్లి, మాన్‌దొడ్డి, నౌరోజీ క్యాంపు, చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ, నసనూరు గ్రామాలలో ఉదయం 8.00 గంటల నుంచి 10.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ఉమిత్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేటీదొడ్డి గ్రామంలోని డీటీఆర్ పని నడుస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి 11 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ గోవిందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 33/11కేవీ ఓల్డ్ సబ్‌స్టేషన్‌తోపాటు 33/11 కేవీ ఐపీడీసీ సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు చేపట్టి, చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు. బింగిదొడ్డి, ఎక్లాస్‌పురం, దేవబండ, జడ్దొడ్డి గ్రామాలకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మల్దకల్‌లో సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు ఈ భజనలో పాల్గొన్నారు. భజన మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

గద్వాల క్రైం: గద్వాల పట్టణానికి చెందిన ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరువురి కుటుంబ సభ్యుల నుంచి అభ్యంతరం చెప్పడంతో శుక్రవారం సాయంత్రం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ శ్రీనివాస్ ఇరువురి కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రేమజంటపై దాడులు, బెదిరింపులకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కుటుంబ సభ్యులకు తెలిపారు. పోలీసుల రక్షణతో ప్రేమజంట ఇంటికి చేరారు.

పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తా



ఇటిక్యాలలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఎర్రవల్లిచౌరస్తా: పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో 52 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వివిధ గ్రామాల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనంలో ఎమ్మెల్యే

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు శివారులో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విజయుడు మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతన్న, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు బెడ్ షీట్లు, కార్పెట్ల పంపిణీ



హాస్టల్ విద్యార్థులకు బెడ్ షీట్లు, కార్పెట్లు పంపిణీ చేసిన వార్డెన్ నర్సింహులు

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు బెడ్ షీట్లు, కార్పెట్లు పంపిణీ చేశారు. శుక్రవారం హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వార్డెన్ నర్సింహులు తెలిపారు. ప్రతి విద్యార్థి ఇచ్చిన సామగ్రిని భద్రంగా ఉంచుకుని ఉపయోగించుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో పిల్లలకు ఆరోగ్యం



అలంపూర్‌లో ఐడీసీఎస్, వైద్యశాఖ అధికారులతో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు



మానవపాడులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సుజాత

అలంపూర్: పౌష్టికాహారంతో పిల్లల ఆరోగ్యం మెరుగై రోగనిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా వైద్యశాఖ అధికారి ప్రమోద్, పీహెచ్‌సీ రామస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ తెలిపారు. అలంపూర్ పట్టణంలోని ఐకేపీ భవనంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు రెండో రోజు కొనసాగాయి. ఈ సమావేశంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త అక్కమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: బాలింతలకు, చిన్నారులకు సరైన పోషకాహారం అందించాలని సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో రెండో రోజు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు న్యూట్రీషన్ చాంపియన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రన్న, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: చిన్నారులకు సరైన పోషకాహారం అందించాలని పోషణ అభియాన్ అధికారి రఘునందన్, డబ్ల్యూహెచ్ఓ కోఆర్డినేటర్ సురేష్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని తిమ్మాపురం రైతు వేదికలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు న్యూట్రీషన్ చాంపియన్ కార్యక్రమంపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్‌వైజర్ సంధ్య, ఎంపీహెచ్ఈఓ శేఖర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు ఉన్నారు.

రాజోళి: పౌష్టికాహారంతో పిల్లలు ఆరోగ్యంగా తయారవుతారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పుష్పలత, లక్ష్మీదేవి, డాక్టర్ స్వప్న, టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



రాజోళిలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు

యల్లందొడ్డిలో పశువైద్య శిబిరం



యల్లందొడ్డిలో పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది

గట్టు: మండలంలోని యల్లందొడ్డిలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకంలో భాగంగా ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఫౌండేషన్ సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 45 మంది రైతులకు సంబంధించిన 246 పశువులకు పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సురేంద్ర, వెటనరీ అసిస్టెంట్లు పృథ్వీరాజ్, కనకరాజు, భవిష్యత్ భారత్ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ బాలరాజు, రాజారాం, లైవ్లీహుడ్ అధికారి హరికృష్ణ, మొబిలైజర్ వినోద్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రూరల్ ఎస్ఐ



గద్వాల క్రైం: గద్వాల రూరల్ ఎస్ఐగా శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దొంగతనలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం కల్పిస్తామన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సాధారణ బదిలీలో భాగంగా కోయిలకొండ నుంచి రూరల్ ఎస్ఐగా ఇక్కడికి వచ్చారు.